జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 6 | జులై | 2025 ♦ పేజీలు : 5



# ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

2 లో...



# ప్రకృతిలో ప్రయోగాలు

## ఇక మీ వంతు...

మొబైల్ ఫొటోగ్రఫీ నేడు చాలా అభివృద్ధి చెందింది. అధునాతన సాంకేతికతతో, ప్రకృతి అద్భుతాలను చిత్రీకరించడానికి మీ ఫోన్ శక్తిమంతమైన సాధనంగా మారుతుంది. చిన్నచిన్న టెక్నిక్స్ ను ఉపయోగించుకుంటూ.. అద్భుతమైన ల్యాండ్ స్కేప్ , ప్రకృతి ఫొటోలను సృష్టించవచ్చు. అధునాతన ఫీచర్లతో మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్నిమీ ఫ్రేమ్స్ లో బంధించవచ్చు. ఎడిటింగ్ లోను సరికొత్త ప్రయోగాలు చేసుకోవచ్చు .

- మాలోత్ అశోక్,
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# రెస్క్యూలో మగువలు సత్తా చాటాలి..

- అత్యుత్తమ శిక్షణ కేంద్రంగా ఆర్జీ-2 మైన్స్ రెస్క్యూ స్టేషన్..
- సింగరేణిలో తొలి మహిళా రెస్క్యూ టీంకు సర్టిఫికేట్ ప్రదానంలో సీఎండీ ఎన్.బలరామ్

2 లో...




## రెండు తెలుగు రాష్ట్రాల్లో....

# వసుధ సేవలు ముదావహం

- క్యాన్సర్ బాధితురాలికి రూ. పది వేలు అందజేసిన ఎస్పీ రోహిత్ రాజు

2 లో..



## ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**ఇల్లందు, జులై 5, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను శనివారం మండలంలోని పూబెల్లి, దండగుండాల గ్రామాలలో ఎమ్మెల్యే కోరం కనకయ్య పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల పనులను పూర్తి నాణ్యతతో నిర్మించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పనులలో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నియోజకవర్గంలో 3500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం రైతులు మొక్కజొన్న విత్తనాలు వేస్తుంటే వారితో కలిసి విత్తనాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ యంపిపి మండల రాము, యంపిఓ చిరంజీవి, మాజీ యంపిపి మోకాళ్ళ వెంకటమ్మ, మాజీ సర్పంచ్ కల్తీ పద్మ, నాయకులు తాటి బిక్షం, డి. శివ, జోగా శ్రీకాంత్, బండి ఆనంద్, చీమల బక్కయ్య, హౌసింగ్ ఏఈ, కార్యదర్శి పాల్గొన్నారు.

## రెస్క్యూలో మగువలు సత్తా చాటాలి..



**కొత్తగూడెం (సింగరేణి), జులై 5, ప్రజాజ్యోతి:** సింగరేణిలో మహిళా రెస్క్యూ జట్టు తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకోవాలని.. నైపుణ్యం, కృషి, అంకితభావంతో ఉత్తమ సేవలు అందించాలని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ పిలుపునిచ్చారు. 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో తొలిసారిగా రెస్క్యూలో శిక్షణ పొందిన మహిళా జట్టును ఆయన హైదరాబాద్ సింగరేణి భవన్ లో శనివారం అభినందించి, సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. సింగరేణిలో మొదటి మహిళా రెస్క్యూ జట్టును ఏర్పరచడం, ప్రత్యేక శిక్షణ ఇవ్వడం సంతోషకరంగా ఉందన్నారు. ప్రమాదాల సమయాల్లో, సేవా కార్యక్రమాల్లో మహిళా రెస్క్యూ జట్టు తమ శక్తి సామర్థ్యాలు నిరూపించుకోవాలన్నారు. త్వరలో జాతీయస్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో జరిగే రెస్క్యూ పోటీలలో కూడా పాల్గొని సింగరేణికి మంచి పేరు తేవాలని శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి రెస్క్యూ బృందాలు ఇటీవల శ్రీశైలం ప్రమాద సమయంలోనూ, హైదరాబాద్ పాశమైలారం అగ్ని ప్రమాద దుర్ఘటనలో, తమిళనాడు లో జరిగిన ప్రమాదంలోనూ తమ విశిష్ట సేవలను అందించి అందరి ప్రశంసలు అందుకున్నారన్నారు. రాష్ట్ర, కేంద్ర విపత్తు ప్రతి స్పందన బృందాలకు సింగరేణి రెస్క్యూ స్టేషన్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సింగరేణి రెస్క్యూను బలోపేతం చేయడానికి అత్యాధునిక సహాయ పరికరాలను సమకూర్చినట్లు తెలిపారు. అదే సమయంలో రామగుండం–2 ఏరియాలో ఉన్న మైన్స్ రెస్క్యూ స్టేషన్ను రెస్క్యూ లో ప్రపంచ స్థాయి శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దబోతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జీఎం (రెస్క్యూ) శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సీఎండీ ఆదేశంతోనే సింగరేణిలో తొలిసారిగా మహిళా జట్టుకు 13 మంది మహిళా అధికారులను ఎంపిక చేసి14 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, అన్ని రకాల శిక్షణలలో మగవారికి ఏ మాత్రం తీసి పోకుండా మహిళా అధికారులు తమ శక్తి సామర్థ్యాలను చాటారని చెప్పారు. త్వరలోనే మరో రెస్క్యూ పోటీలకు మహిళా జట్టును కూడా తయారు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ అభినందన కార్యక్రమంలో డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పా గౌతమ్ పొట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని, హెచ్వోడీ(మార్కెటింగ్) టి.శ్రీనివాస్ పాల్గొన్నారు. మహిళా రెస్క్యూ సిబ్బందికి శిక్షణ ఇచ్చిన రెస్క్యూ శిక్షకులు తిరుపతి, కిషన్ రావు, సందీప్, సాజిద్ అలీకు కూడా ఈ సందర్భంగా ప్రశంసా పత్రం అందజేశారు.



# ప్రకృతిలో ప్రయోగాలు ఇక మీ వంతు...



**మొబైల్ ఫొటోగ్రఫీ నేడు చాలా అభివృద్ధి చెందింది. అధునాతన సాంకేతికతతో, ప్రకృతి అద్భుతాలను చిత్రీకరించడానికి మీ ఫోన్ శక్తిమంతమైన సాధనంగా మారుతుంది. చిన్న చిన్న టెక్నిక్స్ ను ఉపయోగించుకుంటూ.. అద్భుతమైన ల్యాండ్ స్కేప్ , ప్రకృతి ఫొటోలను సృష్టించవచ్చు. అధునాతన ఫీచర్లతో మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మీ ఫ్రేమ్స్ లో బంధించవచ్చు. ఎడిటింగ్ లోను సరికొత్త ప్రయోగాలు చేసుకోవచ్చు . మీ కాలనీ పార్కులో, వాకింగ్ కి వెళ్లినా, అడవుల్లో ట్రెక్కింగ్ చేస్తున్నా.. అక్కడి ప్రకృతి అందాలను బంధించడానికి ఇప్పుడు మీ జేబులోని స్మార్ట్ పోన్ ఉంటె చాలు. నేచర్ ఆధ్భుతాలు, కలర్ ఫుల్ మేమోరిస్, ప్రకృతిలో ప్రయోగాలు ఇక మీ సొంతం అవుతుంది.**

### అవగాహన అవసరం..

**ఫొటోగ్రఫీలోకి వెళ్లేముందు..** మీ ఫోన్ కెమెరా గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండటం అవసరం. అందులో ఉండే ఫీచర్ల గురించి పూర్తిగా తెలుసుకోవడం చాలా ముఖ్యం. నేటి ఆధునిక స్మార్ట్ ఫోన్ లు.. బిల్ట్–ఇన్ సెట్టింగ్స్, అనేక రకాల టూల్స్ తో వస్తున్నాయి. ఇవి ప్రకృతిని అత్యంత నాణ్యతతో ఫొటోలను తీయడంలో మీకు సహాయపడతాయి. వాటిలో ముఖ్యంగా తెలుసు కోవాల్సినవి..

**వైడ్ యాంగిల్ లెన్స్:** ఇప్పుడొస్తున్న అన్ని స్మార్ట్ ఫోన్ లలో 'వైడ్ యాంగిల్' మోడ్ ఖచ్చితంగా ఉంటున్నది. ఇందులోకి వెళ్తే.. ఫొటోలో ఎక్కువ స్థలం కనిపిస్తుంది. విశాలమైన ప్రకృతి దృశ్యాలను బంధించడానికి 'వైడ్ యాంగిల్' మంచి ఆప్షన్.

**నైట్ మోడ్:** తెల్లవారుజామున, సంధ్యా సమ యంలో కాంతి తక్కువగా ఉంటుంది. కానీ, ఆ సమ యంలోనే ఆకాశం ఎరుపురంగు పులుముకొని.. మరింత అందంగా కనిపిస్తుంది. అలాంటి సన్నివేశాలను ఫొటో తీయాలంటే.. నైట్ మోడ్ ని ఉపయోగించండి.

**ప్రో/మాన్యువల్ మోడ్ ;** ఐఫోన్, గూగుల్ పిక్సెల్ వంటి కొన్ని ఫోన్లు ఐఎస్ఓ, ఎక్స్ పోజర్, ఫోకస్ వంటి సెట్టింగ్లపై మాన్యువల్ కంట్రోల్ని అందిస్తాయి. వివిధ లైటింగ్ పరిస్థితులలో మెరుగైన ఫొటోలను తీయడంలో ఇవి కీలకంగా పనిచేస్తాయి. అందుకే మాన్యువల్ సెట్టింగ్స్ గురించి తెలుసుకో వడం చాలా ముఖ్యం.

**హెచ్డిఆర్ (హై డైనమిక్ రేంజ్):** ఈ ఫీచర్ ఫొటోలోని లైటింగ్ ని బ్యాలెన్స్ చేయడంలో సహాయ పడుతుంది. నీడలు, వెలుగు ఎక్కువగా ఉండే ప్రాంతా ల్లోనూ డీటెయిల్స్ ని కోల్పో కుండా చూస్తుంది.

**ఒక్కో సీజన్ ఒక్కోలా..**

ప్రకృతి ఎప్పుడూ మారుతూనే ఉంటుంది. ల్యాండ్ స్కేప్ ఫొటో గ్రఫీ కోసం.. ఒక్కో సీజన్ దానికదే ప్రత్యేకమైన అవకాశాలను అందిస్తుంది. వసంతంలో పొగమంచుతో నిండిపోయే ఉదయాలు.. శిశిరంలో రాలిపడే ఆకులు.. శ్రావణంలో ఆకాశంలో తేలియాడే మేఘాలు.. ఇలా, ఒక్కో సీజన్ మీ ఫొటోలకు ఏదో ఒక ప్రత్యేకతను తీసుకొస్తుంది. అందుకే, కాలానుగుణంగా ప్రకృతి ఎలా మారుతుందో గమనించండి. ఆయా తేడాలను చిత్రీకరించడానికి ఏడాది పొడవునా మీకు ఇష్టమైన ప్రదేశాలకు తిరిగి వెళ్లడం అలవాటు చేసుకోండి. ప్రకృతి అందాలను కెమెరాలో బంధించడమే.. ల్యాండ్ స్కేప్ ఫొటోగ్రఫీ.! గంభీరమైన పర్వతాలు మొదలుకొని ప్రశాంతమైన సరస్సులు, పచ్చని అడవులు, పచ్చిక బయళ్లు.. అన్నీ ఈ కేటగిరీలోకే వస్తాయి. స్మార్ట్ ఫోన్ తో అద్భుతమైన ల్యాండ్ స్కేప్ ఫొటోలు తీసుకోవచ్చు. అందుకోసం కొన్ని టిప్స్, మరికొన్ని టెక్నిక్స్ ఫాలో అయిపోతే చాలు..

**నేచురల్ లైట్లో..** ఆరుబయట తీసే ల్యాండ్ స్కేప్ ఫొటోగ్రఫీలో.. నేచురల్ లైటింగ్ ది కీలక పాత్ర. 'గోల్డెన్ అవర్స్'' అని పిలుచుకునే తెల్లవారుజాము, సంధ్యా సమయాల్లో.. సూర్యుడి నుంచి వచ్చే కాంతి పరిసరాలను ఆహ్లాదకరంగా మారుస్తుంది. అలాంటి సమయాల్లో 'నేచురల్ లైట్'ను వాడుకుంటూ ఫొటోలు తీసుకోండి. ఒకవేళ మధ్యాహ్న సమయంలో షూటింగ్ చేస్తుంటే.. నీడలు, ఓవర్ఎక్స్పోజర్ ఇబ్బంది పెడుతుంది. దీనిని నివారించడానికి.. షేడెడ్ ప్రాంతాలు, మేఘాల నీడలు పడే ప్రదేశాలను చూసుకొని.. అక్కడ మీ ఫొటోలు తీయటానికి ప్రయత్నించండి.

**మీ ఫొటోలో సీన్ ఎంత ముఖ్యమో..** ఆ ఫొటోని ఫ్రేమ్ చేసే విధానం కూడా అంతే ముఖ్యం. కంపోజిషన్ టెక్నిక్ లు మీ ఫొటోలను మరింత బ్యాలెన్స్డ్ గా, ఆకర్షణీయంగా రావడానికి సహాయపడతాయి. కంపొజిషన్ని సమర్థంగా ఉపయోగించడం కోసం కింది చిట్కాలు పాటించవచ్చు.

**రూల్ ఆఫ్ థర్డ్ :** అన్ని స్మార్ట్ఫోన్లలో 'గ్రిడ్స్' ఆప్షన్ ఉంటుంది. ఈ సెట్టింగ్ను ఆన్ చేసుకుంటే.. మూడు నిలువు రేఖలు – మూడు అడ్డ గీతలు ఫ్రేమ్ను తొమ్మిది సమాన భాగాలుగా విభజిస్తాయి. ఫొటోలు మరింత ఆకర్షణీయంగా రావాలంటే.. ప్రధాన అంశాన్ని (ఉదా : చెట్టు, గుట్ట, నది) ఈ రేఖల్లో ఒకదాని వెంట లేదా.. రెండు గీతలు కలిసేచోట వచ్చేలా చూసుకోండి.

**లీడింగ్ లైన్ :** ఫొటోను చూడగానే.. అందరి దృష్టి మెయిన్ సబ్జెక్టుపైకి మళ్లించడానికి లీడింగ్ లైన్లు ఉపయోగపడతాయి. చెట్ల వరసలు, నది గట్లు, రోడ్డుపై గీతలు, ఫెన్సింగ్ లాంటివే.. లీడింగ్ లైన్లుగా ఉపయోగ పడతాయి.

**ఫ్రేమింగ్ :** మీ ఫొటోలు మరింత ఆకర్షణీయంగా రావాలంటే.. మెయిన్ సబ్జెక్ట్ తోపాటు అదనంగా వేరే ఏదైనా సబ్జెక్ట్ లో భాగంగా వచ్చేలా చూసుకోండి. చెట్ల కొమ్మలు, తలుపులు, ఆర్చ్‌లు వంటివి ఫొటోల్లో వస్తే.. సబ్జెక్ట్పై మరింత ఫోకస్ పెరుగుతుంది.

### లాంగ్ ఎక్స్ పోజర్ తో ప్రయోగాలు..

**నిర్దిష్టమైన ల్యాండ్ స్కేప్ షాట్ల కోసం..** లాంగ్ ఎక్స్పోజర్ తో ప్రయోగాలు చేయొచ్చు. కదిలే నీళ్లు, జలపాతాలు, మేఘాలను మరింత అద్భుతంగా చూపించవచ్చు. ఐఫోన్ లాంటి కొన్ని స్మార్ట్ ఫోన్ లు బిల్ట్–ఇన్ లాంగ్ ఎక్స్పోజర్ మోడ్లను కలిగి ఉంటాయి. అవసరమైతే .. Slow Shutter Cam (ఐ ఫోన్ ), Long Exposure Camera 2 (ఆండ్రాయిడ్) వంటి థర్డ్ పార్టీ యాప్స్ ను కూడా వాడొచ్చు.

**ప్రకృతిని గౌరవించండి :** ప్రకృతి అందాలను చిత్రీకరించేటప్పుడు, మీ చుట్టూ ఉన్న వాతావరణాన్ని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. నిర్ణీత మార్గాల్లో ఉండటం, వన్యప్రాణులను గౌరవించడం, సహజ పరిసరాలకు భంగం కలిగించకుండా బాధ్యతాయుతమైన ఫొటోగ్రఫీని ప్రాక్టీస్ చేయండి. ఈ ప్రయోగాలతో మీరు అద్భుతలు చేసి ప్రజాజ్యోతి కి ఆ ఫోటోను పంపండి .. అందులో ది బెస్ట్ ను ఎంపిక చేసి మరియొక కధనం లో ప్రచురిస్తాం. www.prajajyothibktdm57@gmail.com.... వాట్సాప్ ; 8008555508

**- మాలోత్ అశోక్,**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,**
**ప్రజాజ్యోతి**

## రెండు తెలుగు రాష్ట్రాల్లో.. వసుధ సేవలు ముదావహం

**కొత్తగూడెం (క్రైం), జూలై 5, ప్రజాజ్యోతి:** రెండు తెలుగు రాష్ట్రాల్లో వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ముదావహమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం కొత్తగూడెం కు చెందిన క్యాన్సర్ బాధితురాలికి వసుధ ఫౌండేషన్ నుంచి రూ పదివేల చెక్కును ఎస్పీ రోహిత్ రాజు అందజేశారు. కొత్తగూడెంకు చెందిన సింధు క్యాన్సర్ తో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం అందించాలని వసుధ ఫౌండేషన్ ను ఆశ్రయించారు. ఈ క్రమంలో వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు సానుకూలంగా స్పందించి వసుధ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు ను రూ పదివేల ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. దీంతో సింధు సోదరుడు కుమార్ కు రూ పదివేల చెక్కును ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాలకు వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. భవిష్యత్తులో సైతం ఇదే రీతిలో వసుధ సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు, రమేష్ పాల్గొన్నారు.

# విత్తన సేకరణ ఛాలంజ్ లో ముత్తారపుకట్ట పాఠశాలకు మొదటి స్థానం





**ఇల్లందు, జులై 5, ప్రజాజ్యోతి :** ఇల్లందు మండల స్థాయి విత్తన సేకరణ ఛాలెంజ్ లో యంపిపిఎస్ ముత్తారపుకట్ట పాఠశాల మొదటి స్థానంలో నిలిచిందని యంఈఓ ఉమాశంకర్ అన్నారు. శనివారం నిర్వహించిన మండల స్థాయి పోటీలలో జిహెచ్ఎస్, జెబిఎస్ ఇల్లందు, జడ్పిహెచ్ఎస్ 21 పిట్ ఇల్లందు, జిహెచ్ఎస్ మెయిన్ రోడ్, జడ్పిహెచ్ఎస్ చల్ల సముద్రం, జడ్పిహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్, జడ్పిహెచ్ఎస్ కొమరారం, జడ్పిహెచ్ఎస్ సుభాష్ నగర్ 7 కాంప్లెక్స్ నుండి కాంప్లెక్స్ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన ఏడు పాఠశాలలు పోటీ పడడం జరిగింది. ఇందులో అత్యధికంగా అటవీ మొక్కల విత్తనాలు సేకరించిన యంపిపిఎస్ ముత్తారపుకట్ట పాఠశాలను ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని యంఈఓ తెలిపారు. పాఠశాల తరుపున విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా సేకరించి పాఠశాలను మొదటి స్థానంలో నిలిపారని జెబిఎస్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లలిత, ముత్తారపుకట్ట పాఠశాల ఉపాధ్యాయులు కబ్బాకుల రవి, అరెం రవికుమార్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అరుణ్ కుమార్, లాలు, కల్పన, రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ సంఘమిత్ర ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే



**ఆళ్ళపల్లి జులై5 ప్రజాజ్యోతి :** మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా.సంఘమిత్ర ఆధ్వర్యంలో మర్కోడు సబ్ సెంటర్ లోని నడిమిగూడెం గ్రామ పంచాయితీ నడిమిగూడెం గ్రామంలో శనివారం ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సంఘమిత్ర మాట్లాడుతూ జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా ప్రతీ గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టడం జరుగుతుందని, ప్రతీ ఇంటిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతీ ఇంటిలో కూలర్లు మరియు కుండలు అలాగే నీటి నిల్వలు కలిగి ఉండే ప్రదేశాలను గుర్తించి, వాటిని పారబోసి, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది టీ రమాదేవి, హెచ్ఈ, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన కె ఆర్ కె ప్రసాద్



**బూర్గంపహాడ్, జూలై 5 (ప్రజా జ్యోతి) :** బూర్గంపహాడ్ తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ శిరీష లక్ష్మీదేవిపల్లికి బదిలీ కావడంతో అక్కడి విధులు నిర్వహిస్తున్న తహశీల్దార్ ఇక్కడకు వచ్చి విధుల్లో చేరారు. నూతన తహశీల్దార్ కు డీటీ రషీద్, ఆర్ఐలు నర్సింహారావు, వీర్రాజు, కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

### బూర్గంపహాడ్ ఆర్ఐ-1గా వీర్రాజు బాధ్యతల స్వీకరణ...

తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ-1 పోస్టు గత కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. అయితే ఎట్టకేలకు బూర్గంపహాడ్ ఆర్ఐ-1గా ఐటీడీఏలో పనిచేస్తున్న వీర్రాజును నియమించడంతో ఆ పోస్టు భర్తీ అయింది. శనివారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టగా కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## విత్తన సేకరణలో పోలవరం ప్రాథమిక పాఠశాలకు ప్రథమ బహుమతి



**బూర్గంపహాడ్,జూలై5(ప్రజా జ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలల్లో విత్తన సేకరణ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో భాగంగా మండలంలోని మొరంపల్లి బంజర్ కాంప్లెక్స్ స్థాయి పాఠశాలలో జరిగిన విత్తన సేకరణ పోటీలో ఎంపీపీఎస్ పోలవరం పాఠశాల విద్యార్థులు విశేషంగా రాణించి మొదటి బహుమతి అందుకున్నారు. వారు సేకరించిన వివిధ రకాల స్థానిక విత్తనాల నాణ్యత, పరిమాణం, శ్రేణీకరణలో చూపిన ప్రతిభకు ఈ గౌరవం లభించింది. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ఆదినారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాని, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## బిల్లుడు తండ గ్రామంలో ఆరోగ్య శిబిరం



**టేకులపల్లి,జూలై 05, ప్రజాజ్యోతి :** మండలోని బొమ్మనపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని తండా గ్రామంలో శనివారం ఆరోగ్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడి వైద్యని పిల్లలకు తల్లులకు సికిల్ సెల్ ఎనిమియా స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లేని రేపటి భారత సమాజం కోరకు తెలంగాణ ప్రభుత్వ వైద్యారోగ్య శాఖ చేస్తున్న ఉచిత స్క్రీనింగ్ పరీక్ష సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య విస్తరణ అధికారి దేవా కోరారు. ఈ సందర్భంగా తేజవత్ లావణ్య ప్రసాద్ దంపతులకు చెందిన పాపకు అన్నప్రాసన కార్యక్రమం కూడా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ హారిక, ఏఎన్ఎంలు కమల, సుజాత, అంగన్వాడీ టీచర్ సరోజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విత్తనాల సేకరణలో ఆశ్లేష ప్రతిభ

- ఎర్రగుంట విద్యార్థినికి అభినందనలు, రూ.500 బహుమతి




**అన్నపురెడ్డిపల్లి,జూలై 5, ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మార్గదర్శకత్వంలో అన్నపురెడ్డిపల్లి మండలంలోని పాఠశాలల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగంగా విత్తనాల సేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా ఎర్రగుంట ఉన్నత పాఠశాల ఏడవ తరగతి విద్యార్థిని షేక్ ఆశ్లేష 45 కేజీల విత్తనాలు సేకరించి, మండల స్థాయిలో తన పాఠశాల ప్రథమ స్థానంలో నిలవడానికి తోడ్పడింది. ఆమెను మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ ప్రత్యేకంగా అభినందిస్తూ రూ.500 బహుమతిగా అందజేశారు. విత్తనాల సేకరణలో ఉపాధ్యాయుల పాత్రను కూడా ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లు శిరీష, నాగమణి, మండల కంప్యూటర్ ఆపరేటర్ వెంకట రమణ, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ అంగోత్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. విద్యాశాఖాధికారి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, విద్యార్థులు సేకరించిన విత్తనాలను అటవీ శాఖతో కలిసి నాటతామని తెలిపారు.

## నానో యూరియా ఆవశ్యకత గురించి రైతులకు అవగాహన



**టేకులపల్లి,జూలై 05, ప్రజాజ్యోతి:** ఇల్లందు వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడిఏ) లాల్చంద్, ఇలందు నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ ఆధ్వర్యంలో శనివారం బేతంపూడి గ్రామంలో నానో యూరియా ఉపయోగించడం వలన పంటకు చాలా లాభాలు ఉంటాయని రైతులకు అవగాహన కల్పించారు. అదే విదంగా సింగబోయిన రమేష్, బేతంపూడి గ్రామంలో ప్రత్తి పంటలో నానో యూరియా పిచికారి ప్రదర్శన చేయించారు. నానో యూరియా పిచికారి చేయడం వలన పూర్తి స్థాయిలో వినియోగం జరుగుతుంది అనీ తెలియ జేయడం జరిగినది. బచ్చల కూరి అశోక్ క్షేత్రమును సందర్శన చేసి అక్కడ కోర్రమీను,చేపల పెంపకం పై నీటి కుంట వలన లాభాలు గురించి రైతులకు వారు తెలియజేశారు. జాలాది శ్రీనివాస్ క్షేత్రమును సందర్శన చేసి మునగ మొక్కల పెంపకం గురించి నిమ్మతోటలలో పలు సలహాలు సూచనలు అందించారు. ఈ క్షేత్ర సందర్శనలో మండల వ్యవసాయి అధికారిని ఎన్ .అన్నపూర్ణ ,ఏ ఈ ఓ ప్రవీణ్ ప్రకాష్, ఆత్మ కమిటీ మెంబర్ బండారి నరసింహారావు, గంగ సిరి సతీష్,గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ బైక్ ర్యాలీ



**బూర్గంపహాడ్, జూలై 5 (ప్రజా జ్యోతి):** దేశవ్యాప్తంగా 9న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మె జయప్రదం కోరుతూ మండల పరిధిలోని సారపాక ప్రధాన సెంటర్ లో సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ పాండవుల రామనాథం మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లుగా తెచ్చి కార్మికులపై ఉక్కుపాదం మోపిందని, జీఎస్టీ పేరుతో పేద ప్రజానీకానికి,కార్మికవర్గానికి తీవ్రనష్టం చేస్తుందని మండిపడ్డారు. సార్వత్రిక సమ్మెకు అన్ని రంగాల కార్మిక వర్గాలు, వ్యవసాయ కార్మికులు అన్ని రంగాల ప్రజలు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగం గౌరవ అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, అధ్యక్షులు నాగేశ్వరరావు, నూనె వెంకన్న, శ్రీనివాసరావు, ప్రేమ్చంద్, విద్య, సాయి రమణ, పండు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రవాణాలో 100.. ఉత్పత్తి 99

- మొదటి త్రైమాసికంలో బొగ్గు రవాణ 100, ఉత్పత్తి 99 శాతం సాధించిన సింగరేణి
- హర్షం వ్యక్తం చేసిన సీఎండీ ఎన్. బలరామ్
- జులై లో రోజుకు 1.8 లక్షల టన్నుల ఉత్పత్తి, 2.15 లక్షల టన్నుల రవాణా సాధించాలి
- ఈ నెలలో కొత్తగూడెం వీకే ఓపెన్ కాస్ట్ కు భూమి పూజ
- వర్షాకాలపు జాగ్రత్తలతో ఓసీ గనుల నుండి నిరాటంకంగా బొగ్గు ఉత్పత్తి సాగించాలి
- భూగర్భ గనులలో ఉత్పత్తిని గణనీయంగా పెంచాలి
- ఏరియా జీఎంలకు సంస్థ ఛైర్మెన్ ఆదేశం



**కొత్తగూడెం [సింగరేణి] జులై 5, ప్రజాజ్యోతి :** సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బొగ్గు రవాణాలో 100 శాతం, బొగ్గు ఉత్పత్తిలో 99 శాతం లక్ష్యాలను సాధించడం పై సీఎండీ ఎన్.బలరామ్ హర్షం వ్యక్తం చేశారు. ఏప్రిల్ నుండి జూన్ నెల వరకు బొగ్గు రవాణా లక్ష్యం 160 లక్షల టన్నులు కాగా, 103 శాతం తో కంపెనీ 166 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసింది. అలాగే బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 160 లక్షల టన్నులు కాగా, 99 శాతం తో కంపెనీ 159.9 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి సాధించింది. శనివారం హైదరాబాద్ లోని సింగరేణి భవన్ నుంచి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ సంస్థ డైరెక్టర్లతో, అన్ని ఏరియాల్లోని జీఎంలతో త్రైమాసిక ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కూడా ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి కుంటు పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జులై నెలకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించడం కోసం రోజుకు 2.15 లక్షల టన్నుల బొగ్గు రవాణా, 1.80 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయ న ప్రతీ ఏరియా ప్రగతిపై సంబంధిత ఏరియా జీఎంతో సమీక్షించారు. ఉత్పత్తికి అవరోధంగా ఉన్న అంశాల పైన ఆయన అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. కాగా కొత్తగూడెంలో అన్ని అనుమతులు మంజూరైన వీకే ఓపెన్ కాస్ట్ గని భూమి పూజ కార్యక్రమాన్ని ఈ నెలాఖరులో నిర్వహించాలని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇల్లందు జేకే కోల్ మైన్, గోలేటి కోల్ మైన్ కు సంబంధించిన పర్యావరణ, అటవీ శాఖ అనుమతులకు సంబంధించి ప్రయత్నాలు మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన బొగ్గు నాణ్యతా ప్రమాణాల పెంపుదలకు తీసుకుంటున్న చర్యలపై నిశితంగా చర్చించారు. వినియోగదారులకు ఇస్తామన్న గ్రేడ్ బొగ్గును సరఫరా చేయడానికి ప్రతీ ఏరియాలో సిహెచ్ పి లలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. అలాగే రక్షణకు సంబంధించి ప్రతీ గనిలో రక్షణ ఆడిట్లను నిర్వహించాలని, రక్షణ లోపాలు లేకుండా సవరించాలని ఆయన సేఫ్టీ విభాగం వారిని ఆదేశించారు. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్ లో ప్రారంభమైన బొగ్గు ఉత్పత్తి పై కూడా ఆయన సమీక్షించారు. అక్కడ ఉత్పత్తి అవుతున్న బొగ్గును సమీపంలోని చండిపడా రైల్వే సైడింగ్ కు రవాణా చేయడానికి తగు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కార్యక్రమంలో డైరెక్టర్లు డి. సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్.వి సూర్యనారాయణ(ఆపరేషన్స్ ), కె. వెంకటేశ్వర్లు(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ గౌతమ్ పొట్రు(పా), ఈడీ (కోల్ మూమెంట్ ) ఎస్.డి.ఎం సుభాని, అడ్వైజర్ (ఫారెస్ట్రీ) మోహన్ పరిగెన్, జీఎం (సి పి పి) ఏ.మనోహర్, కార్పోరేట్ జీఎంలు, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

## భద్రాద్రిలో గోదావరికి కొత్తనీరు





**భద్రాచలం, జూలై 5,ప్రజాజ్యోతి :** గోదావరి ఉపనది ఇంద్రావతి నదీ పరివాహక ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరికి కొత్త నీరు వచ్చి చేరింది. దీంతో ఎరుపు రంగు నురగలతో పరవళ్లు తొక్కుతుంది. ఇటీవల వరకు భద్రాచలం వద్ద ఐదు అడుగులు మాత్రమే ఉన్న నీటిమట్టం కొత్త నీటి రాకతో స్వల్పంగా పెరుగుతుండగా ప్రస్తుతం 19.5 అడుగులకు చేరుకుంది. చాలారోజుల తర్వాత భద్రాచలం స్నానఘట్టాలు జలకళ సంతరించుకున్నాయి. మెల్లగా గోదావరి పెరుగుతుండటంతో స్నానఘట్టాల వద్ద చిరువ్యాపారుల దుకాణాలు సురక్షిత ప్రాంతానికి తరలించుకున్నారు.

## ఐటీడీఏ పీవోకు ఆటో జేఏసీ యూనియన్ ఫిర్యాదు

**భద్రాచలం, జూలై 5,ప్రజాజ్యోతి :** తమకు న్యాయం చేయాలంటూ ఆటో యూనియన్ జేఏసీ సభ్యులు శుక్రవారం ఐటీడీఏ పీవో రాహుల్ కు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ వద్ద ఎన్నో సంవతర్సాలుగా ఆటో కార్మికులందరూ యూనియన్ గా ఏర్పడి అడ్డా ఏర్పాటు చేసుకుని కూనవరం, చింతూరు మండలాలకు ఆటోలు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ఉచిత మరుగుదొడ్లు ఏర్పాటు చేయగా అక్కడ ఉంటున్న ఒక బడా వ్యాపారి కుటుంబసభ్యులు, మహిళలు ఆటో అడ్డా స్థలాన్ని ఆక్రమించి బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే గ్రామపంచాయతీ కార్యదర్శి, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఎన్నో వందల కుటుంబాలు జీవనాధారమైన మా కొడుపు కొట్టకుండా ఆటో కార్మికులమైన మాకు న్యాయం చేయాలని పీవోకు వినతిపత్రం అందజేశారు.

## పర్యావరణ పరిరక్షణకై మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



**పాల్వంచ(రూరల్),జులై 05,ప్రజా జ్యోతి:** సమాజంలో పర్యావరణ పరిరక్షణకై మొక్కలు నాటడం సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలి.అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా పాల్వంచ కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.శనివారం మండలం పరిధిలోని సోముల గూడెం సొసైటీ కొనుగోలు సిసిఐ సెంటర్ వద్ద పాలకవర్గ సభ్యులు మొక్కలు నాటారు.మొక్కలు పెంచడం వలన పర్యావరణ కాలుష్యం నివారణ జరుగుతుందన్నారు.వర్షాలు కురుస్తాయి అన్ని పాలకవర్గ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు,సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్,పాలకవర్గ సభ్యులు చౌగాని పాపారావు, మైనేని వెంకటేశ్వరరావు,భూక్య కిషన్,సీఈవో జి లక్ష్మీనారాయణ, సోముల గూడెం పంచాయతీ కార్యదర్శి కందకట్ల శ్యామ్,మాజీ ఎంపీటీసీ భూక్య శంకర్, గ్రామస్తులు కళారావు,కలకొండ నరసింహారావు,జగదీశ్వర్ రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో వైభవంగా శ్రీ బాలాజీ స్వామివారి కళ్యాణ మహోత్సవం



**అన్నపురెడ్డిపల్లి ,జులై 5, ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ మేనేజర్ పి.వి. రమణ ఆదేశానుసారం,



అర్చకులు సంప్రదాయబద్ధంగా, వైదిక పద్ధతిలో కళ్యాణోత్సవాన్ని నిర్వర్తించారు.మంగళ వాద్యాల మధ్య,మంత్రోచ్చారణలతో స్వామి,అమ్మవార్లకు కళ్యాణం నిర్వహించగా, భక్తులు భారీగా హాజరై స్వామివారి కళ్యాణ దర్శనం పొందారు.ఆలయం అందంగా అలంకరించబడింది.భక్తుల భక్తిశ్రద్ధలతో ఆలయ పరిసరాలు పుణ్యక్షేత్రమయంగా మారాయి.స్వామివారి అనుగ్రహంతో గ్రామంలో శాంతి, ఐక్యత, సంపదలు చేకూరాలని భక్తులు ప్రార్థించారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణతులసి పూజలు



**భద్రాచలం కల్చరల్ , జూలై 5,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అర్చకులు శనివారం స్వర్ణతులసి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం రామయ్యకు పట్టాభిషేక కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.